శ్రమజీవులకు మంచి రోజులు

- స్థానికంగానే ఉపాధి పనులు
- ఆనందంలో వేతనదారులు


కూనవరం మండలం జగ్గవరంలో వేతనదారులకు సూచనలిస్తున్న అధికారులు


అరకులోయ మండలం పానిరంగినిలో భూమి చదును పనుల్లో వేతనదారులు

అరకులోయ రూరల్: శ్రమ జీవులకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది. పనుల్లో మరింత పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామాల్లోనే పనులు కల్పిస్తుండడంతో వలస బాటలు తప్పాయి. సొంత ఊళ్లో ఉపాధి దొరకుతుండడంతో శ్రమ జీవులు పనులు చేసుకుంటూ ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో శరవేగంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. అర్హులున్న ప్రతి ఒక్కరికి పనులు లభిస్తున్నాయి. దీంతోపాటు రోజువారీ వేతనం పెంచడంతో వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల భూములు అభివృద్ధి చేసేందుకు పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వేతనదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అరకు మండలంలో 14 గ్రామ పంచాయితీల పరిధిలో 14, 673 జాబ్‌కార్డుదారులకు గాను 13,077 మందికి ఉపాధి పనులు కల్పించారు. వీరిలో ఇప్పటికే 3,89,629 రోజులు పని దినాలు కల్పించారు. ఈ ఏడాదిలో ప్రభుత్వ లక్ష్యానికి చేరే విధంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. గతంలో కూలీలకు రోజువారీ రూ.100 నుంచి రూ.150 వరకు ఉండేది.. ప్రస్తుత రేటు రూ.272 వరకు వస్తోంది. ప్రస్తుతం చెరువు తవ్వకాలు, రాతికట్లు, ట్రెంచ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఫారంపాండ్స్, చెరువుల పనులు చేపడుతున్నారు. ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాదారులకు కూడా ఉపాధి పనులు ప్రభుత్వం కల్పిండంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 3800 మంది ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాదారులకు 150 రోజులు పనిదినాలు కల్పించినట్టు అధికారులు తెలిపారు.

ఊపందుకున్న పనులు

కూనవరం: మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. గత సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన గోదావరి వరదలకు వ్యవసాయ పనులు ఆలస్యంగా మొదలవడంతో మార్చి నెలాఖరు వరకు వ్యవసాయ పనులతో కూలీలు బిజీ అయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో ఉపాధి పనులు ఊపం దుకున్నాయి. ఫారం పాండ్లు, చెరువుల పూడిక తీతలు, భూమిచదును చేయడం తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 3,250 మంది కూలీలు ఉపాధి హామీ పనులలో పాల్గొంటున్నారు. 2023–24 సంవత్సరాంతానికి పాత పనులు గాక రూ. 22 కోట్లు అంచనాలతో 90 కొత్త పనులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. ఈ ఏడాది 3.33 లక్షలు పనిదినాలు కల్పించడం ప్రభుత్వం లక్ష్యం కాగా ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 72 వేల పని దినాలు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయా పనులకు రూ. 80 లక్షలకు పైగా వ్యయం అయినట్టు పేర్కొన్నారు. సాధారణ కూలీల పనిదినాలు 100 రోజులు కాగా ఆర్వోఎఫ్‌ఆర్ లబ్ధిదారులకు 150 రోజులు పనిదినాలు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఇప్పటి వరకు 46 పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ శ్రీకాంత్ తెలిపారు.

భూముల అభివృద్ధి



ఉపాధి పనులు రావడంతోనే మా భూములను అభివృధి చేసుకోగలుగుతున్నాం. ఉపాధి లభించడంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గింది. ప్రభుత్వం కల్పించే ఇటువంటి అవకాశంతో మాకు ఎంతో మేలు కలుగుతుంది.

– జిన్ను, హట్టగూడ, గ్రామం, అరకులోయ మండలం

విస్తారంగా పనులు



అన్ని ప్రాంతాల్లో గిరిజనులకు అవసరమైన పనులు కల్పిస్తున్నాం. విస్తారంగా పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరే విధంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు పనిదినాలు కల్పిస్తున్నాం. పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలి.

–సత్యనారయణ, ఏపీవో, అరకులోయ మండలం

క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థికి అభినందనలు


నవనీత్‌కు పురస్కారం అందజేస్తున్న ఏపీ ఐక్య జంగమ సేవా సంఘం ప్రతినిధులు

సాక్షి, పాడేరు: ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 523మార్కులతో ముంచంగిపుట్టు మండల టాపర్‌గా నిలిచిన మగ్గు నవనీత్‌కు ఆదివారం విశాఖలో ఘన సత్కారం లభించింది. ఏపీ ఐక్య జంగమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అభ్యసించి, అధిక మార్కులు సాధించిన నవనీత్‌ను పలువురు అభినందించి సన్మానించారు. జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. నవనీత్ తండ్రి మహేష్ పాడేరులో పత్రికరంగంలో పనిచేస్తున్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు


ఫ్రాగ్‌జంపింగ్ పోటీల్లో చిన్నారులు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫ్రాగ్ జంపింగ్(కప్ప గంతులు), టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరాల్లో నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు.

మోదకొండమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న దాతలు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుడు వంతాల శేషగిరినాయుడు, వెంకటలక్ష్మి దంపతులు ప్రసాదాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా శేషగిరినాయుడు దంపతులతో పాటు వారి కుమార్తెలు మధుప్రియ, కల్పనశ్రీలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

మోదమ్మకు జలాభిషేకం

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో మోదకొండమ్మకు ఆదివారం జలాభిషేకం చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు, మంగరాజు సారథ్యంలో మాలధారణ భక్తులు అమ్మవారి పీఠం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 30న అమ్మవారి ఘటాలు, సారె ఊరేగింపు వచ్చే నెల 4న అమ్మవారి ఊరేగింపు ఇరుముడులు ధరించి, పాదయాత్రగా మాడుగుల వెళ్లి అక్కడ మాలధారణ విసర్జన చేస్తామన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

సాక్షి,పాడేరు: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు శత జయంతిని ఆదివారం జిల్లాలోని పలుచోట్ల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాడేరులో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కాంతమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు విజయరాణి, నాగరాజు, కొండబాబు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీటీసీ సన్యాసిరావు తదితరులు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో నేచర్ సంస్థ ఆధ్వర్యంలోని ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని పాల్గొన్న సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు యువతను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తోందని, యువత క్రీడల్లో రాణించాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలోని వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన నేచర్ సంస్థ డైరెక్టర్ వికాష్ బాలరాజును అభినందించారు. మండల కో–ఆర్డీనేటర్ బంగారుబాబు, ప్రసాద్, చంద్రశేఖర్, యువత పాల్గొన్నారు.

6న సదానంద సరస్వతి స్వామి జయంతి

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రంలో జూన్6న సదానంద సరస్వతి స్వామి జయంతి నిర్వహించనున్నట్టు క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని జగదాంబ త్రిశక్తి పీఠాధిపతులు, విజయ కనకదుర్గ దేవస్థానం వ్యవస్థాపకులు తాళ్లూరి బెనారస్ బాబు గురూజీ విచ్చేయుచున్నట్టు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

గడప గడపకు సంక్షేమం

- గ్రామాల్లో పర్యటించిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి


సీతగుంటలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్మపర్సన్ జల్లిపల్లి సుభద్ర


బూసిగూడెంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పెదబయలు: ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి ఆదుకుంటుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ.ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మపర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండలంలోని సీతగుంట గ్రామ సచివాలయం పరిధిలోని సీతగుంట, సీతగుంట గడ్డికాలని, సీతగుంట పాత వీధిలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు గిరిజనులు పూలమాలలు, హారుతులతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 130 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని గిరిజనులు వారి వద్ద ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందుతోందన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ పొందడానికి అనేక కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉండేదని..నేడు ఇంట్లో ఉంటేనే అన్ని పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

రూ.37 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకంతో తాగునీటి కల్పన

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఉమ్మడి మూడు జిల్లాల్లో జల్‌జీవన్ మిషన్ (జెజెఎం)ద్వారా రూ.37 కోట్లతో తాగునీటి సదుపాయం కల్పించనున్నట్టు చెప్పారు. తాగునీటి ఎద్దడి లేకుండా మండల పరిషత్ నిధులు, జెజెఎం నిధులతో తాగునీటి పథకం, ఇంటింటికీ కుళాయి పనులు చేపడుతున్నామన్నారు. సీతగుంట పంచాయతీకి తాగునీటి ఎద్దడి ఉందని సర్పంచ్ కోరారు. దీంతో స్పందించి వెంటనే ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి ఉందో గుర్తించాలని స్థానిక ఇంజినీర్లకు ఆదేశించారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, ఎంపీడీవో పూర్ణయ్య, మండల ఇంజినీరింగ్ అధికారి సంజీవరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జర్సింగి గంగాభవాని, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, నాయకులు రూడ లక్ష్మణరావు, గంపరాయి సూరయ్య, వార్డు సభ్యులు తమర్బ హేమలత, కోడ జగన్నాథం, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతాన్ని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరం మండలం బూసిగూడెం సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ మూడున్నర ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రానున్నరోజుల్లో కూడా వీటితో పాటు అనేక సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపీపీ బందం కుమారి, పార్టీ మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు సింగోజీ కృష్ణకుమారి, మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కో–ఆప్షన్ మెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు


పనులకు శంకుస్థాపన చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో రామాలయ వీధిలో, జిల్లా పరిషత్ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ ఆర్‌సీపీ ప్రభుత్వ హాయంలో మన్యంలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియ పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యేల పర్యటనలు

కొయ్యూరు: మండలంలోని పెదమాకవరంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని పార్టీ నేతలు తెలిపారు. కార్యక్రమానికి ముందుగా కొయ్యూరులో గ్రామవలంటీర్లను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు.

అనంతరం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కాకరపాడు నుంచి బైక్ ర్యాలీలో పాల్గొంటారని పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మారేడుమిల్లి: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మండలంలో సోమవారం జరిగే పలు కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు పందిరి మామిడి కోట గ్రామంలో నూతన వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన, అనంతరం కూడూరు, మద్దులూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం


లుంగాపుట్టు వద్ద రహదారిపై ఒరిగి ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో లుంగాపుట్టు మలుపు వద్ద భారీ చెట్టు పూర్తిగా ఎండిపోయి ఎప్పుడూ కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎండిన చెట్టు చూసిన వాహనచోదకులు భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. గతంలో నిలువుగా ఉండే చెట్టు గత కొద్ది రోజులుగా ఒరిగిపోవడంతో వాహనచోదకులు మరింత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈదురుగాలుల వల్ల ఎండిన చెట్టు ఎప్పుడు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే పంచాయితీ అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ఎంచ ప్రచండం


బాటిళ్లతో నీటిని పట్టుకెళ్తున్న రైతులు


తొట్టెలో నీటిని తాగుతున్న మూగజీవాలు

రాజవొమ్మంగి: మండలంలో రోజురోజుకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోహిణి కార్తెలు 25వ తేదీ నుంచి మొదలు కావడంతో మండుతున్న ఎండలకు జనం బెంబేలెత్తుతున్నారు. ఎండతో పాటు ఉక్కపోత, వడగాల్పులతో స్థానికులు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఎండ వేడిమి ప్రారంభమవుతోంది. పొలం పనులను ఉదయం 11 గంటలకే స్వస్తి పలికి ఇళ్లకే పరిమితమవుతున్నారు. జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మామిడి తోటల్లో కాపలాకు వెళ్లే రైతులు బాటిళ్లలో నీటిని సేకరించి వెంట తీసుకొని వెళుతున్నారు. మూగజీవులు తాగు నీటి కోసం అల్లాడుతున్నాయి. చెట్ల నీడన సేదతీరుతున్నాయి. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే అడపాదడపా వర్షాలు కురవడంతో కొంత ఉపశమనం పొందుతున్నారు. రోహిణి ఎండలు తెరిపిచ్చే వరకు వేసవి తాపం తప్పదని పెద్దలు చెబుతున్నారు.

తురాయిపూల కనువిందు



అరకులోయ రూరల్: మన్యంలో ప్రస్తుత సీజన్‌లో చాలా చోట్ల అందమైన తురాయిపూలు కనువిందు చేస్తున్నాయి. గిరి అందాలకు మరింత శోభను సంతరిస్తున్నాయి. మండల కేంద్రంలోని పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయం సమీపంలో విరబూసిన తురాయి పూల అందాలు కనువిందు చేస్తున్నాయి. చెట్టంతా ఎర్రటి పూలతో ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి.

సనాతన ధర్మ పరిరక్షణపై ప్రచారం


పాదయాత్రలో పాల్గొన్న స్వామిజీ, భక్తులు

జి.మాడుగుల: కృష్ణాపురం శ్రీ పాకలపాటి గురుదేవుల ఆశ్రమం శ్రీ రామానంద స్వామిజీ విశ్వశాంతి లోక కళ్యాణార్థం, సనాతన ధర్మ పరిరక్షణ పాదయాత్ర ఆదివారం నిర్వహించారు. మండలంలో గాంధీనగరం శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. సంతబయలు, మత్స్యపురం, బందవీధి, గన్నేరుపుట్టు, బడిమెల కాలనీ, కె కోడాపల్లి, శ్రావణినగర్, బొక్కెళ్లు గ్రామాల మీదుగా సాగింది. గ్రామాల్లో రామ నామస్మరణతో మార్మోగింది. గిరిజన గ్రామాల్లో భక్తులు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామానంద స్వామిజీ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణపై గిరిజన గ్రామాల్లో పాదయాత్ర ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని పాటించాలన్నా. పాకలపాటి గురుదేవుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు, సర్పంచ్ కిముడు రాంబాబు, భక్తుల సంఘం నాయకులు గబ్బాడి శేఖర్, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

31న వామలింగేశ్వర కల్యాణం

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31న వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ ఆదివారం తెలిపారు. బుధవారం సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న న్యాయవాది చాణక్య

అడ్డతీగల: మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ భవనంలో ఆదివారం హిందూ నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది చాణక్య పలు న్యాయపరమైన అంశాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వీహెచ్‌పీ సహ సేవా ప్రముఖ్ ఎస్.భావన్నారాయణ, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ జిల్లా అధ్యక్షుడు బి.కాటంరెడ్డి, కార్యదర్శి పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి పండగ

మునగపాక : ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఊరేగించి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా పట్టాలమ్మ పండగ

మాకవరపాలెం: స్థానిక కిందివీధిలో పట్టాలమ్మతల్లి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం మహిళల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com